అల్లూరి సీతారామరాజు

ఎస్ఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -పాడేరు: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా 2వ మహాసభలో పాడేరు పిఎంఆర్సి భవనంలో ఈనెల 8,9తేదిలలో జిల్లా మహాసభలు విజయ వంతంగా జరిగాయి. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రాం మోహన్ అధర్యంలో. ఎస్ఎఫ్ఐ అల్లూరి జిల్లా నూతన కమిటీ కార్యవర్గం ఎంపికయింది.. అల్లూరి జిల్లా అధ్యక్ష కార్యదర్శిలుగా పాంగి. జీవన్ కృష్ణ, కొర్ర.కార్తీక్, జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా పాంగి. సింహాద్రి, జాయింట్ సెక్రటరీగా పాంగి. చిన్నారావు ఎన్నికయ్యారు.జిల్లా కమిటీ సభ్యులుగా ఐసుబాబు, శైలు, సునందిని, ప్రభాస్, దిలీప్, ప్రేమ్, మణి, భాస్కర్, కిషోర్, సోమరా, పురిస్తాన్, అతిరామ్, యిర్మీయా, జాన్ పడల్, రామ్ చరణ్ ఎన్నికయ్యారు.ఈ కార్యక్రమం లో మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు పి.అప్పలనరస పాల్గొన్నారు.

జీవన్ కృష్ణ, కార్యదర్శి



కార్తిక్, అధ్యక్షులు

మ్యుటేషన్, రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయాలి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు:రీ సర్వే, మ్యూటేషన్, ప్రక్రి యలో అలసత్వం చేయకుండా చూడాలని, డి పట్టా భూమి, ఆర్ ఓ ఎఫ్ ఆర్ భూమి, జిరాయితీ భూమి లో పంట పండించే ప్రతి రైతుకి అన్నదాత సుఖీభవ పథకం అందేలాగా చూడాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో నుండి ఆర్డీవోస్, అన్ని మండలాల తహసిల్దార్, మండల సర్వే అధికారుల, గ్రామ రెవెన్యూ, సర్వే, పౌర సరఫరాల శాఖ అధికారు లతో రెవెన్యూ సమస్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, రీ సర్వే చేసినప్పుడు ప్రభుత్వ భూములు, డి పట్టా ల్యాండ్స్ పూర్తిగా పరిశీలించి వెబ్ ల్యాండ్స్ డివిజన్ చేయాలని, వాటిపై తిరిగి కంప్లైంట్ రాకుండా చూడాలని, పట్టా చేసేటప్పుడు 1,2 సార్లు పరిశీలించి తర్వాత మాత్రమే పట్టాలు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలద్వారా లబ్ధి పొందడానికి సంబంధిత పత్రాలు లబ్దిదారులకు అందజేయడంలో ఆలస్యం కాకూడదని అధికారులకు ఆదేశించారు. పి జి ఆర్ ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులు వెనువంటనే పరిష్కరించాలని, దీనిపై తహసిల్దార్ శ్రద్ధ చూపాలని, ఎస్ఎల్ఎ పీరియడ్ దాటకుండా చూడాలని పేర్కొన్నారు. పిటిషన్ దారితో మాట్లాడి పదే పదే పిటిషన్ రిపీట్ కాకుండా చూడాలని సమస్యను పరిష్కరించాలన్నారు. రీ సర్వే ప్రక్రియలో గ్రామం సరిహద్దులలో ఉన్న సంబంధిత శాఖ భూములకు నోటీసులు ఇవ్వాలని తెలిపారు. అటవీ, రెవెన్యూ సమస్యలు ఉన్న గ్రామాలలో సమస్యలు సంబంధిత ఫారెస్ట్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించాలన్నారు. ఆన్లైన్ పద్ధతిలో టెక్నికల్ సమస్యలు ఉంటే కలెక్టరేట్ ఈడీఎం కు ఫిర్యాదు తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఈ ఆఫీస్ ద్వారా డాక్యుమెంట్ అప్లోడ్, డిజిటల్ ప్రక్రియను వేగవంతం చేసి అప్లికేషన్లు క్లియర్ చేయాలని తసిల్దారులకు ఆదేశించారు. నాలా పన్నుల వసూలు (వాటర్ టాక్స్)ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు.ఓటర్ల జాబితా మ్యాపింగ్ కానీ నియోజకవర్గాలలో త్వరగా బిఎల్వోలు, సూపర్వైజర్లు పూర్తిచేయాలని, అలసత్వం వహిస్తే తగిన చర్యలు ఉంటాయని అన్నారు.ఈ కార్యక్రమంలో రంపచోడవరం ప్రాజెక్టు అధికారి స్మరణ్ రాజ్, చింతూరు ఇంచార్జి ప్రాజెక్ట్ అధికారి శుభమ్ నొక్వాల్, సహాయ కలెక్టర్ కె సాహిత్, ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి అంబేద్కర్, ఇంచార్జి ఆర్డీఓ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంవిఎస్ లోకేశ్వరరావు, ఏడి రీ సర్వే దేవేంద్రుడు పాల్గొన్నారు.

హాజరైన అధికారులు

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి-పాడేరు:సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి 20 సంవత్సరములు పూర్తయిన సందర్భంగా మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో అవగాహన సదస్సు నిర్వహించారు .. అల్లూరి జిల్లా సహకార అధికారి ఎం వి రామకృష్ణంరాజు అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాడేరు డివిజన్ లో గల 11 మండలాలకు సంబందించిన పిఏసిఎస్ సీఈఓ లులు, డిగ్రీ కాలేజీ విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపకులు, సహకార శాఖ సిబ్బంది పాల్గొన్నారు. సమాచార హక్కు చట్టం 2005 పై అసిస్టెంట్ రిజిస్ట్రార్లు పి. కృష్ణ, , పౌర సమాచార అధికారి సిహెచ్ మరిడయ్య, ఉప పౌర సమాచార అధికారి సంతోష్ కుమార్ అవగాహన కల్పించారు.

చలితో వణుకుతున్న గిరిజనం

-అరకు వ్యాలీలో 4.7 డిగ్రీల ఉష్ణోగ్రత

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరు మన్యంలో మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కు పడిపోయింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండటతో చలి అధికంగా ఉండడంతో మన్యం వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలితో పాటు తెల్లవారుజాము నుంచి తొమ్మిది, పది గంటల వరకు మంచు దట్టంగా కురుస్తోంది. చలి బారి నుంచి శరీరాన్ని కాపాడుకోవడానికి ఉన్ని దుస్తులు ధరించడం, చలి మంటలను ఆశ్రయించడం జరుగుతుంది. ఉదయం వేళల్లో దట్టంగా పొగ మంచు కమ్మేస్తుండటంతో వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. మధ్యాహ్నం 4 గంటల నుంచి చలి గాలులు వీస్తుండడంతో మన్యం వాసులు గజగజలాడుతున్నారు. రాత్రి వేళల్లోనూ పొగ మంచు దట్టంగా కురుస్తోంది. మంగళవారం అరకు వ్యాలీలో 4.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా, డుంబ్రిగూడలో 5.7, జి.మాడుగులలో 5.5, హుకుంపేటలో 6.9, ముంచింగిపుట్టులో 5.9, చింతపల్లిలో 6.0, పాడేరులో 6.7, పెదబయలులో 7.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

పాడేరులో కురుస్తున్న పొగమంచు

వాహనదారులు నిబంధనలు పాటించాలి

జిల్లా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సాయి రమేష్

రికార్డులు పరిశీలిస్తున్న సాయి రమేష్

ప్రజాశక్తి హుకుంపేట:-ప్రజల ప్రాణ భద్రత కోసం ప్రతి వాహనదారుడు రహదారి నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం ఉందని అల్లూరి సీతారామరాజు జిల్లా అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ సి. హెచ్. సాయి రమేష్ అన్నారు. ప్రమాదాలు నివారించడమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రత్యేకంగా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఆయన సూచించారు. హెల్మెట్ ధరించని వాహనదారులపై ప్రత్యేకంగా చలానాలు విధించి, రహదారి భద్రతపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. త్రైమాసిక పన్ను చెల్లించకుండా సరుకు రవాణా చేస్తున్న గూడ్స్ వాహనాలపై చలానాలు విధించి, కొన్ని వాహనాలను సీజ్ చేసినట్లు మంగళవారం పేర్కొన్నారు.గత వారం రోజులుగా విస్తృత రవాణా తనిఖీలు నిర్వహించగా 12 వాహనాలకు రూ.80,330 చలానాలు విధించామని చెప్పారు. చోడవరం-పాడేరు మార్గంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న జీపులను గుర్తించి చలానాలు విధించామన్నారు.

గ్రంథాలయాల్లో తనిఖీలు

హుకుంపేటలో రికార్డులు పరిశీలిస్తున్న కుమార్‌రాజు

ప్రజాశక్తి-హుకుంపేట: స్థానిక ప్రభుత్వ గ్రంథాలయంలో మంగళవారం వార్షిక పరిశీలన నిమిత్తం జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారి బి. కుమార్ రాజు ఆకస్మిక పరిశీలనలు నిర్వహించారు. గ్రంథాలయం నిర్వహణను స్వయంగా పరిశీలించిన ఆయన, పాఠకులకు అందించాల్సిన సేవలపై సిబ్బందిని అప్రమత్తం చేశారు.గ్రంథాలయంలో పాఠకుల సంఖ్య పెరగాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం విద్యార్థులు, యువత, పోటీ పరీక్షల అభ్యర్థులు మరింతగా గ్రంథాలయాన్ని వినియోగించేలా ప్రోత్సహించాలని సూచించారు. అదేవిధంగా గ్రంథాలయం ఆవరణ, పుస్తకాల పట్టికలు, పఠనశాల ప్రాంతం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు ఆనంద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎల్.వి. రమణ, గ్రంథపాలకురాలు సత్యవతి పాల్గొన్నారు.
డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని జిల్లా శాఖ గ్రంథాలయంలో ఉమ్మడి విశాఖ జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి బి కుమార్ రాజు మంగళవారం సందర్శించి పరిశీలించారు. గ్రంథాలయాల పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అల్లూరి జిల్లాలో పూరిస్థాయి భవనాలు ఉన్న గ్రంథాలయాలకు డిజిటల్ కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వానికి నివేదిక అందించనున్నామని చెప్పారు. గిరిజన యువతను పోటీ ప్రపంచానికి తీర్చిదిద్దేలా పుస్తకాలు గ్రంథాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రంథాలయ అసోసియేషన్ యూనియన్ నాయకులు ఆనందరావు, రమణ, గ్రంథాలయ అధికారిణి సునీత సిబ్బంది సుబ్బారావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి

పశువుల వ్యాధులపై అవగాహన

ప్రజాశక్తి- అనంతగిరి: ఈ సీజన్ కాలంలో మూగజీవులకు వ్యాపించే పలు వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని అనంతగిరి పశువైద్య శాఖ అధికారి డాక్టర్ అనిల్ రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని అనంతగిరి పంచాయతీ పరిధి రాజుపాక గ్రామంలో మంగళవారం సందర్శించారు. పశువులు, మేకలకు వ్యాపించే వ్యాధులకు పై ప్రతి ఒక రైతు అవగాహన కలిగి ఉండాలన్నారు. టీకాలు వేయించుకోవాలని సూచించారు. వైద్య సేవాలు రైతులు సకాలంలో అందించకపోవడంతో అనేక వ్యాధులతో మూగజీవులు అనారోగ్యాలతో గురవుతాయాని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్, ఎగువ శోభ మాజీ సర్పంచ్ పాంగి. మదు పాల్గొన్నారు.

క్రికెటర్ కరుణకుమారికి సత్కారం

ప్రజాశక్తి-పాడేరు: మండలంలోని వంటల మామిడి గ్రామంలో ఈ ప్రాంతానికే చెందిన అంధురాలైన క్రికెట్ క్రీడాకారిణి పి కరుణ కుమారిని మండల విద్యాశాఖ అధికారి యం జాన్ ఘనంగా సత్కరించారు. అందుల క్రికెట్లో దేశం తరపున ఎంపికై క్రికెట్ కప్ సాధించడంలో ప్రతిభ చూపిన కరుణకుమారి అల్లూరి జిల్లాకు ఆమె గుర్తింపు తీసుకువచ్చారని కొనియాడారు. మండల విద్యాశాఖ తరపున గ్రామస్తులు ఈ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

సత్కరిస్తున్న ఎంఇఒ

సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం

యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

రాజవొమ్మంగి : మాట్లాడుతున్న యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి శ్రీను

అడ్డతీగల : తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొలగాని శ్రీను, కానెం శ్రీను పిలుపునిచ్చారు. యుటిఎఫ్ మండల శాఖ అత్యవసర కార్యవర్గ సమావేశం మండల అధ్యక్షులు గొలగాని శ్రీను అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే ఉద్యోగుల కు ఐఆర్ ప్రకటించాలని, పిఆర్సి కమిషన్ వేయాలని, డిఎలు ఉద్యోగుల ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని బోధనేతర కార్యక్రమాలను రద్దు చేయాలని, ఏజెన్సీ ప్రత్యేక డిఎస్సి ప్రకటించాలని, ఇప్పటికీ కొన్ని గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలలకు వేతనాలు అందలేదని, ఉద్యోగులందరికీ ఒకటో తేదీన వేతనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికై ఈ నెల 18న అల్లూరి జిల్లా కేంద్రంగా నిర్వహిస్తున్న ధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యక్షులు జంపా రాంబాబు, సహాధ్యక్షురాలు కోడూరి లోవరాజు, జిల్లా కార్యదర్శి మిరియాల రమేష్‌బాబు, మండల మహిళా కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న, మహిళా కమిటీ కన్వీనర్ విజయ కుమారి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు వెంకటలక్ష్మి, జిల్లా కౌన్సిలర్స్ రమణ, ఎం. సత్యవతి, సిపిఎస్ కన్వీనర్ దొండ్ల అప్పన్న, మండల కార్యదర్శిలు, నీలాద్రి రాజబాబు,చెన్నంశెట్టి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.
అడ్డతీగల: విద్యాశాఖను అత్యవసర శాఖగా మార్చారని యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కె.వి.రాఘవులు అన్నారు. సీతపల్లి సెంటర్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ వివిధ సమస్యలపై నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సెలవు దినాల్లో కూడా పనిచేయాలని ఆదేశించారని, 100 రోజుల స్పెషల్ డ్రైవ్ పేరుతో ఆదివారం కూడా పనిచేస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి మినహాయించి, బోధనకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. యాప్‌ల భారాన్ని తగ్గించాలని కోరారు. అదేవిధంగా 12వ పిఆర్సి కమిషన్ నియమించి, ఐఆర్‌ని వెంటనే ప్రకటించాలని, పెండింగ్ డిఎను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 18న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమం చేపడతామని తెలియజేశారు. కార్యక్రమంలో సహాధ్యక్షురాలు రమణమ్మ, జిల్లా కౌన్సిలర్ కమలారత్నం, చిన్నారవు కృష్ణ పాల్గొన్నారు.

గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలి

- సిఐ శ్రీనివాసరావు

ప్రజాశక్తి- కొయ్యూరు: గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని సిఐ శ్రీనివాసరావు సూచించారు. దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న భజన, కోలాట పోటీల దరఖాస్తు పత్రాన్ని మంగళవారం సిఐ శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఇటువంటి పోటీలు నిర్వహించడం వల్ల సనాతన ధర్మ పరిరక్షణతో పాటు ఆధ్యాత్మికతను పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ పోటీలకు చెక్కభజన హరిభజన, కోలాటం ఇతర రకాలైన భజన బృందాలు దరఖాస్తు చేసుకోవచ్చని ధార్మిక సంస్థల సేవా ప్రతినిధి డివిడి ప్రసాద్ తెలిపారు. మొదటగా మండల స్థాయిలో పోటీలు నిర్వహించి అనంతరం జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. బిజెపి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు శివకుమార్, పద్మరాజు(నాని), విహెచ్‌పి జిల్లా ప్రతినిధి మల్లిబాబు, ఎస్ఎస్ఎఫ్ మండల ధర్మ ప్రచారక్ శ్రీను, ఉపాధ్యాయులు కిరణ్, ఆదివాసీ అర్చక సేవా సంఘం గౌరవాధ్యక్షులు లోతా శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోటీల దరఖాస్తు పత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిఐ శ్రీనివాసరావు

అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలి

- ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

ప్రజాశక్తి- చింతూరు: ఈ నెల 21న చింతూరు కేంద్రంలో సిపిఎం అమరవీరుల సభను నిర్వహిస్తున్నామని ఈ సభను జయప్రదం చేయాలని ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పిలుపునిచ్చారు. చింతూరులో ముర్రం రంగమ్మ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనులచేత వెట్టి చాకిరీ చేయిస్తూ ఫారెస్ట్ అధికారులు, కాంట్రాక్టర్లు గిరిజనుల శ్రమను దోచుకుంటూ గిరిజనులను అడవిలోకి పోకుండా మేకలు ఆవులు మేపుతున్న సందర్భంలో కేసులు పెడుతూ, బిపిఎల్ లాంటి సంస్థలు ఆదివాసులను దోపిడీ చేస్తున్న క్రమంలో గిరిజనులను ఐక్యం చేసి, దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేసి నేలకొరిగిన వీరులు అనేకమంది ఉన్నారని, వారిని స్మరించుకునేందుకు ఈ నెల 21న అమరవీరుల సభ నిర్వహిస్తున్నామని సభను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో సీసం సురేష్, చింతా రాంబాబు, మొట్టమ్ రాజయ్య, లక్ష్మణ్, సుబ్బారావు, బివి.రమణ, మల్లేశ్, మడకం చిన్నయ, పత్రా రమేష్, సోడి దుర్గరావు, చిన్నక్క తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బొప్పెన కిరణ్

వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-సీలేరు: జికెవీధి మండలం సీలేరు జూనియర్ కళాశాల ప్రోగ్రామింగ్ ఆఫీసర్, కామర్స్ లెక్చరర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో దుప్పిలివాడ పంచాయతీ దత్తత గ్రామం బూసికొండలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. దీనికి విశేష స్పందన లభించింది. 48 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాకర్మింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాంలో భాగంగా ప్రతి ఏడాది ఏదో ఒక గ్రామాన్ని దత్తతి తీసుకొని స్వచ్ఛభారత్, వైద్యశిబిరం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రజలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలన్నారు. ఎవరైనా అనారోగ్యానికి గుర్రైతే స్థానిక పిహెచ్‌సిలో సంప్రదించి వైద్యసేవలు పొందాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ త్రినాథ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయని చలి, మంచు తీవ్రత అధికంగా ఉందని రోగాలు బారిన పడకుండా ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు. మంచినీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. చలికాలంలో ఉన్ని దుస్తులు ధరించడం శ్రేయస్కరమని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శంకరరావు, విద్యార్థులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

సిమెంట్‌రేకులు, పైపులు అందజేస్తున్న జమాల్‌ఖాన్

అగ్నిప్రమాద బాధితునికి గృహనిర్మాణ సామగ్రి వితరణ

ప్రజాశక్తి -చింతూరు: మండలంలోని వంకగూడెం గ్రామానికి చెందిన కరక ముత్తమ్మ అనే ఆదివాసి మహిళ ఇల్లు గత ఆదివారం అగ్నిప్రమాదానికి గురై దగ్ధమైంది. ముత్తమ్మ భర్త మృతి చెందడంతో ముగ్గురు పిల్లలను కష్టంతో పోషించుకుంటోంది. అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధమవడంతో స్థానిక తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జెకెసి ఛైర్మన్ జమాలాఖాన్ దృష్టికి తీసుకురాగా ఆయన స్పందించి ఇంటి నిర్మాణానికి కావలసిన సిమెంట్ రేకులు, ఇనుప పైపులను అందజేశారు. కార్యక్రమంలో సాల్మన్‌రాజు, రియాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సిబ్బంది హాజరు పట్టికను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాసరావు

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి - కొయ్యూరు: సచివాలయ ఉద్యోగులు సమయ పాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని కొయ్యూరు డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాసరావు తెలిపారు. కొయ్యూరు మండలం బంగారంపేట 1, 2 సచివాలయాలను మంగళవారం ఆయన సందర్శించారు. పనిచేస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బంది హాజరుపట్టిక, మూమెంట్ రిజిస్టర్ ఇతర రిజిస్టర్లను పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులంతా విధిగా సమయానికి హాజరు కావలసిందేనని ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నీ సంక్షేమ పథకాలకు సకాలంలో పంపిణీ పూర్తి చేసి ప్రతి అర్జీదారునికి జవాబుదారీతనంగా పనిచేయాలని ఆదేశించారు.

యుటిఎఫ్ నూతన కార్యవర్గం

ప్రమాణస్వీకారం చేస్తున్న ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

ప్రజాశక్తి-అరకులోయ :అరకులోయ మండల యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నికయ్యింది. స్థానిక ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జిల్లా కౌన్సిలర్లు టి.చిట్టిబాబు, ఆర్.ఎరుకులు, యు. గంగరాజుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో గౌరవ అధ్యక్షులుగా ఎస్.దుక్కునాయుడు, అధ్యక్షుడిగా కే.రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికవగా, ఉపాధ్యక్షులుగా డి రాజు బాబు, ఎం పార్వతి, ప్రధాన కార్యదర్శిగా ఏ.లచ్చన్న, కోశాధికారిగా ఎస్. స్వామి, కార్యదర్శులుగా ఎస్.నారాయణ, ఎల్సీ కుమారి, పి.శాంత కుమారి, ఎల్.నాగమ్మ, వి.శాంత కుమారి, బి.శ్యామల, కే.శ్రీనివాసరావు, జి.సింహాద్రి నాయుడు,ఎస్. రామచందర్, ఆడిట్ కమిటీ సభ్యులిగా ఎల్సీ కామేశ్వరరావు లు ఎన్నికయ్యారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

నేడు వైసిపి నిరసన ర్యాలీ

ప్రజాశక్తి-కాశీపట్నం:రాష్ట్రంలో మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 10న అరకులోయలో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆధ్వర్యంలో జరగనున్న నిరసన కార్యక్రమానికి అనంతగిరి మండలంలోని వైఎస్ఆర్సిపి మండల నాయకులు సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కమిటీలు, ప్రజా ప్రతినిధులు, గిరిజన విద్యావంతులు హాజరై జయప్రదం చేయాలని వైసిపి మండల అధ్యక్షులు కొర్ర సూర్యనారాయణ విజ్ఞప్తి చేశారు.సుమారు పది వేల మందితో జరిగే ఈ ర్యాలీని జయప్రదం చేసి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకునేలా చేయడమే ధ్యేయంగా కోటి సంతకాల సేకరణ ప్రతులను అధిష్టానానికి అందిస్తామన్నారు.

బార్ కౌన్సిల్‌లో మహిళలకు రిజర్వేషన్లపై హర్షం

ప్రజాశక్తి - సీతమ్మధార: బార్ కౌన్సిల్లో మహిళలకు సముచిత స్థానం కల్పిస్తూ 30 శాతం రిజర్వేషన్ ఇవ్వాలంటూ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పునివ్వడంపై విమెన్ అడ్వకేట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వావా) సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పౌర గ్రంథాలయంలో మీడియా సమావేశంలో వావా అధ్యక్షులు పప్పు అనురాధ, జనరల్ సెక్రెటరీ హేమమాలిని మాట్లాడుతూ అన్ని శాఖల్లోని మహిళా రిజర్వేషన్ ఉన్న బార్ కౌన్సిల్లో మహిళా రిజర్వేషన్ లేకపోవడం పట్ల తమకు బాధగా ఉండేదన్నారు. దీనిపై దాఖలైన రిట్ పిటిషన్ విచారించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోమాల్యా బాగ్చిలతో కూడిన ధర్మాసనం 2026 జనవరి ఫిబ్రవరిలో జరగనున్న బార్ కౌన్సిల్ ఎలక్షన్లో మహిళలకు 30 శాతం రిజర్వేషన్ ప్రకటిస్తున్నామని తెలిపారన్నారు. ఈ తీర్పు మహిళా న్యాయవాదులకు ఎంతో ఊరట కలిగించి, రాష్ట్ర బార్ కౌన్సిల్ లో తమ వంతు సేవ చేసే అవకాశం కల్పించిందని ఆనందం వ్యక్తం చేశారు. దీనికి సహకరించిన కౌన్సిల్ చైర్మన్ సీనియర్ అడ్వకేట్ మనన్ కుమార్ మిశ్రా, ఇతర సీనియర్ మహిళా న్యాయవాదులకు, రిట్ వేసి చారిత్రాత్మక తీర్పుకు నాంది పలికిన పిటిషనర్లకు కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు తేజేశ్వరి

ప్రజాశక్తి-తగరపువలస : రాష్ట్రస్థాయి కౌశల్ పోటీలకు స్థానిక జివిఎంసి.అంబేద్కర్ ఉన్నత పాఠశాల చిట్టివలస విద్యార్థిని కొప్పల తేజశ్వరి ఎంపికైంది. ఇటీవల నిర్వహించిన కౌసల్ పరీక్షకు జిల్లాలో మొదటి స్థానం సాధించింది.కొప్పల తేజేశ్వరిని విశాఖ డిఇఒఎన్.ప్రేమకుమార్ అభినందిస్తూ నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. పాఠశాల హెచ్ఎం వైఎస్‌వివిపిడి.స్వామి,ఉపాధ్యాయ సిబ్బంది ఎన్.జగదీష్ పి.సత్యలక్ష్మి, రెడ్డిపల్లి అప్పలరాజు, కె. బలరామకృష్ణ, ఎం.విశ్వేశ్వరరావు .ఎన్. శ్రీదేవి, ప్రమీల, మహాలక్ష్మి తదితరులు తేజశ్వరిని అభినందించారు.

నిర్మాణం పూర్తయినా.. నిరుపయోగం

• బిల్లులు చెల్లించకపోవడంతో భవనాన్ని అప్పగించని కాంట్రాక్టర్

• రోగులకు తప్పని అవస్థలు • ఐదేళ్లుగా వినియోగానికి దూరంగా ఆరోగ్య ఉపకేంద్ర భవనం

ప్రజాశక్తి -అనంతగిరి: పంచాయతీ పరిధి ప్రజలకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్య సేవ అందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య ఉప కేంద్రాల భవనం నిర్మాణం చేపట్టింది. పనులు పూర్తయినా నేటికీ వినియోగంలోకి రాకపోవడంతో గిరిజనులు ఇబ్బందులకు గురవుతున్నారు.

స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం పరిధి బొడ్డచెటుకోలని- బాలికల పాఠశాల (అరకు మెయిన్ రోడ్డుకు) ఆనుకొని 2019-20 సంవత్సరంలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రభుత్వం నిర్మించింది. సంబంధిత కాంట్రాక్లర్ పనులు త్వరితగతిన పూర్తి చేసినప్పటికి బిల్లులను ప్రభుత్వం చెల్లించ లేదు. దీంతో, ఏళ్లు గడుస్తున్నప్పటికీ సంబంధిత డిపార్ట్మెంట్‌కు కాంట్రాక్టర్ ఆరోగ్య ఉప కేంద్ర భవనాన్ని అప్పగించ లేదు. దీంతో ఆ భవనం నిరుపయోగంగా మారింది.బిల్లులను చెల్లించక పోవడంతో ఆరోగ్య ఉప కేంద్రానికి తాళాలు వేసి ఉన్నాయి. రోగులకు వైద్య సేవలు అందించడంలో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి పూర్తయిన ఉప ఆరోగ్య కేంద్ర భవనాన్ని అప్పగించాలని పలువురు కోరుతున్నారు.

నిరుపయోగంగా ఉన్న ఆరోగ్యఉప కేంద్రం

సెల్ టవర్ల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించాలి

జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : అల్లూరి జిల్లా ఏజెన్సీ గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న బిఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్ టెల్ టవర్లను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలని అధికారులకు అధికారులను జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ విసీ హాల్ నుండి నిర్వహించిన వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బిఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్ టెల్, మండల తహసిల్దార్లు, అటవీశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ల్యాండ్ ఎక్విజేషన్ పూర్తయిన ప్రాంతాల్లో టవర్స్ ఏర్పాటు చేసి 4జి సిగ్నల్స్ అందించాలని ఆదేశించారు. జిల్లాలో పాడేరు డివిజన్ కు సంబంధించిన బిఎస్ఎన్ఎల్ టవర్స్ 561 సెంక్షన్ కాగా 457 పూర్తి అయ్యి, 104 టవర్స్ వివిధ దశలలో ఉన్నాయన్నారు. రంపచోడవరం డివిజన్‌లో బి ఎస్ ఎన్ ఎల్ టవర్స్ 364 శాంక్షన్ అయ్యాయని అందులో 355 పూర్తి చేసామని, మిగిలిన 9 టవర్స్ వివిధ దశలలో ఉన్నదని త్వరలో పూర్తి చేస్తామని బి ఎస్ ఎన్ ఎల్ ఏ జి ఎం తెలియజేశారు. జిల్లాలో అదనంగా 101 బి ఎస్ఎన్ఎల్ టవర్స్ ఏర్పాటుకు అనుమతులు వచ్చాయని అందుకు సంబంధించి స్థల పరిశీలన చేయాలని జిల్లా కలెక్టర్ మండల తహసిల్దార్‌కు ఆదేశించారు. జిల్లాలో జియో టవర్స్ ఏర్పాటుకు ప్రభుత్వం నుండి 509 అనుమతులు పొందగా అందులో 445 టవర్స్ పూర్తి చేసామని, 64 వివిధ దశలలో ఉన్నదని జియో ఏజిఎంతెలియజేశారు.

జిల్లాలో ఎయిర్ టెల్ టవర్స్139 అనుమతులు పొందగా అన్ని పనులు పూర్తి చేసామని ఎయిర్ టెల్ అధికారులు అన్నారు. రహదారి సదుపాయము లేని (కనెక్టివిటీ) ప్రాంతాలకు టవర్స్ ఏర్పాటుకు సంబంధించిన సామాగ్రిని తరలించుటకు అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయం చేసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో బిఎస్ఎన్ఎల్ ఏజీఎం శ్రీకాంత్, జిఓ ఏజీఎం సత్యప్రసాద్, ఎయిర్ టెల్ అధికారులు పాల్గొన్నారు.

ఒకటో తేదీన జీతాలు చెల్లింపులో విఫలం

ప్రజాశక్తి-చింతపల్లి : ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్ తీవ్రంగా విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో వైయస్సార్‌సిపి ప్రభుత్వ కాలంలో బడ్జెట్ సీజన్‌లో మాత్రమే ఒకటో తేదీకి జీతాలు ఆలస్యమైనప్పటికీ, ఐదేళ్లపాటు ఉద్యోగులను ఎప్పుడూ ఇబ్బంది పెట్టలేదని చెప్పారు.

ప్రస్తుతం అల్లూరి జిల్లా ఐటిడిఏ పరిధిలో ట్రైబల్ వెల్ఫేర్ శాఖకు చెందిన రెగ్యులర్ ఉద్యోగులు కూడా జీతాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. డైలీవేజ్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు రెండు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం అత్యంత దారుణమన్నారు. డిసెంబరు, జనవరిలో పండగల సీజన్‌లోనూ ప్రభుత్వం ఆలోచన చేయకపోవడం దురదృష్టకరమన్నారు.

వీధి దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలో కంద్రుమ్ పంచాయతీ సర్రాయి గ్రామంలో పంచాయితీ 15వ ఆర్థిక సంఘం నిధులతో వీధి దీపాలను పునరుద్ధరించారు. స్థానిక సర్పంచ్ ,సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు కె హరి మాట్లాడుతూ, అన్ని గ్రామాల్లో వీధి దీపాలు కల్పించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్ ఆనంద్, వార్డు సభ్యులు ఎం కృష్ణ,గ్రామస్తులు ఎం దొబ్బ, కె రాంబాబు, ఎం శేఖర్ పాల్గొన్నారు.

వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు

మాట్లాడుతున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అల్లూరి జిల్లా అరకువేలి మండలం లోతేరు పంచాయితీ పరిధిలోని ధనసనివలస, కిక్కటిగుడ గ్రామాలకు చెందిన కిల్లో సురేంద్ర, కిల్లో సిబో, తాంగుల రాందాస్‌లను కూలిపనుల పేరుతో బ్రోకర్ రామకృష్ణ కాకినాడకు తీసుకెళ్లినట్లు మంగళవారం అరకులోయ పోలీసు స్టేషన్ లో పిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. కాకినాడ నుండి యువకులను తెలంగాణ రాష్ట్రం కొల్లంపూర్ ప్రాంతంలో ఉన్న ఒక చేపల చెరువుకు తరలించి, అక్కడ రాజు, రాము అనే వ్యక్తులకు అప్పగించినట్లు తెలిపారు. అక్కడ వారిని రోజువారీ శ్రమకు గురి చేస్తూ, తీవ్రమైన చిత్రహింసలకు లోను చేస్తూ బలవంతంగా పని చేయిస్తున్నారని కుటుంబ సభ్యులు ఆరోపించారు.

డబ్బులు అడిగితే మరింతగా వేధింపులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ పిల్లలను ఎలాగైనా అప్పగించాలని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, కిల్లో నోబో, కిల్లో ప్రసాద్, శ్రీరాములు, కిల్లో దొబ్బులు, బాధితుల తల్లిదండ్రులు కిల్లో రాంమూర్తి, తాంగుల పద్మ, వెంకట్ రావు పాల్గొన్నారు.

సమస్యలపై సహకార ఉద్యోగుల ధర్నా

సిఐటియు ఆధ్వర్యాన వినతిపత్రం ఇస్తున్న సహకార సంఘాల ఉద్యోగులు

ప్రజాశక్తి -పద్మనాభం : తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పద్మనాభంలో సంఘం జిల్లా అధ్యక్షులు రామకృష్ణ ఆధ్వర్యంలో డిసిసిబి బ్యాంకు ప్రాంగణంలో సోమవారం సహకార సంఘాల సిబ్బంది ధర్నా నిర్వహించారు. రాష్ట్రసంఘం పిలుపుమేరకు సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతూ, జిఒ 36 అమలుపరిచి సొసైటీ ఉద్యోగులందరికీ డిఎల్ఎస్ఎఫ్ ఏర్పాటుతో జీతభత్యాలు చెల్లించాలన్నారు.

ఐదేళ్లకోసారి చేపట్టాల్సి వేతన సవరణ 2019 తర్వాత చేయలేదని, తక్షణమే వేతన సవరణ చేపట్టి, ఉద్యోగులకు మధ్యంతర భృతి చెల్లించాలన్నారు. ఉద్యోగుల గ్రాట్యూటీ సీలింగ్ పరిమితిని రూ.2లక్షల నుంచి పెంచి చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగుల వలే ఉద్యోగ విరమణ వయస్సును 62ఏళ్లుగా కొనసాగించాలన్నారు. సొసైటీ ఉద్యోగులకు ఐదేళ్లకు తక్కువ కాకుండా ఆరోగ్యబీమా కల్పించాలని, సర్వీసులో ఉన్న ఉద్యోగి మరణిస్తే రూ.20లక్షల రిటైర్మెంట్ ఇన్సూరెన్స్ పాలసీ కల్పించాలన్నారు. ధర్నా అనంతరం బ్రాంచ్ మేనేజర్ బోను వెంకట అప్పారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఇఒలు సిహెచ్ ఉమామహేశ్వరరావు, కె.కోటేశ్వరరావు, ఎం అప్పారావు, వెంకట్రావు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలకు హాజరు కావాలి

ప్రజాశక్తి -సీలేరు: యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో డిసెంబర్ 30 నుంచి 4 వరకు నిర్వహించే మహాసభలకు కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో తరలి వెళ్లి విజయవంతం చేయాలని యునైటెడ్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ సీలేరు సిఐటియు బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు బి.లక్ష్మణ్, విష్ణుకుమార్ పిలుపునిచ్చారు. స్థానిక విలేకరులతో మంగళవారం మాట్లాడుతూ ఎపి జెన్కో, ఎపి ట్రాన్స్‌కోతో పాటు వివిధ రంగాల్లో కాంట్రాక్ట్ కార్మికులగా దీర్ఘకాలికంగా పనిచేస్తున్న వారందరినీ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెగ్యులరేజ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్తు రంగం ప్రైవేటీకరణ అడ్డుకోవడం, లేబర్‌కోడ్స్ విధానాన్ని వ్యతిరేకించడం సభల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. విశాఖపట్నంలో జరగబోయే భారీ బహిరంగ సభకు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు దుగ్గిరాల సూరిబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుమంత్, పలువురు నాయకులు హాజరవుతారని తెలిపారు. మన హక్కుల గురించి కాంట్రాక్ట్ కార్మికులంతా ఐక్యంగా పోరాడవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎటిడబ్ల్యూఒ క్రాంతికుమార్

ఆశ్రమ వసతిగృహాలకు వసతుల కల్పన

- ఎటిడబ్ల్యూఒ క్రాంతికుమార్

ప్రజాశక్తి-కొయ్యూరు: కొయ్యూరు మండలం ఆశ్రమ వసతి గృహాలకు ఆర్వో ప్లాంట్స్ టాయిలెట్స్ బాత్రూమ్స్ కొత్తగా మంజూరైనట్లు ఎటిడబ్ల్యూఒ క్రాంతికుమార్ తెలిపారు. మంగళవారం పాకల ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆశ్రమ పాఠశాలలకు ఆర్ఒ ప్లాంట్లు, బాత్‌రూంలు మంజూరైనట్టు తెలిపారు. ఆశ్రమ పాఠశాల పరిసరాలను ఆయన పరిశీలించారు. కొయ్యూరు ఆశ్రమ వసతిగృహాన్ని సందర్శించిన పిఒ తిరుమనిశ్రీ పూజ కొన్ని వసతులు సమకూ ర్చాల్సిన అవసరాన్ని అవశ్యకతను తెలియజేసిన కొన్ని రోజులకే మంజూరు చేయటం ప్రశంసనీయమంటూ పలువురు కొనియాడారు. కొత్తగా 8 పాఠశాలలకు ఆర్వో ప్లాంట్లు, 12 పాఠశాలలకు టాయిలెట్స్ మంజూరైనట్లు ఎటి డబ్ల్యూఒ తెలియజేశారు.

చెత్త తొలగిస్తున్న సిఆర్‌పిఎఫ్ సిబ్బంది

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి -సీలేరు: పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యతని సిఆర్‌పిఎఫ్ ఆఫీస్ కమాండెంట్ కేఎన్ కృష్ణ పేర్కొన్నారు. జికె వీధి మండలం సీలేరులో స్వచ్ఛత అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సిఆర్‌పిఎఫ్ 42 బెటాలియన్ ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ నిర్వహించారు. శివాలయం, మారెమ్మ ఆలయం, రామాలయం, హైస్కూల్, పోస్టాఫీస్ తదితర ప్రదేశాల్లో చెత్తా చెదారాలు ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. అనంతరం హైస్కూల్ విద్యార్థులతో సిఆర్‌పిఎఫ్ ఆఫీస్ కమాండెంట్ కృష్ణ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన పరిశుభ్రతపై విద్యార్థులు ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ పోలీసులు, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ కేసులతో ఉద్యమాలను ఆపలేరు

గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు

సిపిఎం, గిరిజన సంఘ నేతలకు పోలీసుల నోటీసులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: అక్రమ కేసులు పెట్టి, నోటీసులు ఇచ్చినంత మాత్రాన ఉద్యమాన్ని ఆపలేరని గిరిజన సంఘ రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు స్పష్టం చేశారు. గొంతువానిపాలెం రహదారి నిర్మించాలంటూ ఇటీవల సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేసిన నేపథ్యంలో మండలంలోని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావుతో పాటు పలువురు సిపిఎం, గిరిజన సంఘం నేతలకు అడ్డతీగల పోలీసులు మంగళవారం వారి ఇళ్లకు వెళ్లి నోటీసులు జారీ చేశారు.గంటల తరబడి రహదారిపై ధర్నా చేసినందుకు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా లోతా రామారావు మాట్లాడుతూ. ఏలేశ్వరం గొంతువాని పాలెం మీదుగా జడ్డంగ అన్నవరం వెళ్లే రహదారి అధ్వానంగా ఉందని రహదారి నిర్మించాలంటూ ధర్నా చేసిన నేపథ్యంలో అక్రమంగా కేసులు నమోదు చేయడం అన్యాయమన్నారు. రహదారి ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిర్మించే వరకూ తమ ఉద్యమం ఆగబోదని, భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ చేపడతామని తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి కొండ్ల సూరిబాబు, సిఐటియు మండల కన్వీనర్ టి శ్రీను తదితరులు నోటీసులు అందుకున్నారు.

నోటీసుపై సంతకం చేస్తున్న లోతా రామారావు

నేటి నుంచి టెట్

పరీక్ష రాయనున్న 26,248 అభ్యర్థులు

వివరాలు వెల్లడించిన డిఇఒ ప్రేమ్‌కుమార్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలోని 12 కేంద్రాల్లో బుధవారం నుంచి 21వ తేదీ వరకు ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. పరీక్ష నిర్వహణ ఏర్పాట్లపై వివిధ విభాగాల అధికారులతో మంగళవారం కలెక్టరేట్ విసి హాలులో సమీక్షించిన ఆయన పలు వివరాలను వెల్లడించారు. విశాఖపట్టణం జిల్లాలో 11 కేంద్రాలుండగా, అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో ఒక కేంద్రం ఉందన్నారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులతో కలిసి మొత్తం 26,248 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు వివరించారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు రెండు పూటలా పరీక్ష ఉంటుందని చెప్పారు. పరీక్ష నిర్వహణలో అందరూ బాధ్యతగా వ్యవహరించాలని, సజావుగా జరిగేలా సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. అన్ని కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, తాగునీటి సదుపాయం, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆయా రూట్లలో పరీక్ష సమయానికి అనుగుణంగా బస్ సర్వీసులను నడపాలని సంబంధిత అధికారులకు చెప్పారు. 12 కేంద్రాల్లో కలిపి మొత్తం 121 మంది స్క్రైబ్స్ ఉన్నారని, దానికి తగ్గట్లు ఏర్పాటుచేసుకోవాలని ఆయా కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. పర్యవేక్షణకు అధికారులను నియమించామని, డిఇఒ కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్కు కూడా ఏర్పాటు చేశామని వెల్లడించారు. అధికారులు గానీ,పరీక్ష రాసే అభ్యర్థులు గానీ సహాయం కోసం 9177292969, 9618584051, 8328524861 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ఎడి జి.గోపీకృష్ణ, ఆర్ఐఒ చంద్రశేఖర్, డిప్యూటి డిఇఒ సోమేశ్వరరావు, ఐ అండ్ పిఆర్, విద్యుత్, పోలీసు, వైద్యారోగ్య, ఆర్‌టిసి, జివిఎంసి అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విశాఖ బాలోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వరుసగా మూడోసారి నిర్వహిస్తున్న విశాఖ బాలోత్సవం మంగళవారం స్థానిక సెయింట్ ఆంథోనీ తెలుగు మీడియం ప్రైమరీ స్కూల్లో మంగళవారం ప్రారంభమైంది. ఈ పిల్లల పండగను జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాలలలో ఒక్కొక్కరిలో ఒక్కొక్క విధమైన ప్రతిభ ఉంటుందని, వారి టాలెంట్ ఆధారంగా ప్రోత్సహించాలని తల్లిదండ్రులను, ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమానికి పాఠశాల ఆవరణను ఇచ్చిన ఫాదర్ పి.రత్నకుమార్‌ను, నిర్వాహకులను ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రోటరీ ఇంటర్నేషనల్ 3020 డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వై.కల్యాణ చక్రవర్తి మాట్లాడుతూ, రోటరీ సేవాభావంతో ప్రపంచవ్యాప్తంగా పని చేస్తుందన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

ప్రజాశక్తి- విశాఖపట్నం : రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లాలో ఈ నెల 12వ తేదీన పర్యటించనున్న నేపథ్యంలో సంబంధిత ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌తో కలిసి మధురవాడ ఐటీ హిల్స్‌ను సందర్శించి, అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను గమనించారు. కాగ్నిజెంట్ కంపెనీకి శంకుస్థాపన చేయనున్న ప్రాంతంలో, విఇఆర్ (వైజాగ్ ఎకనామిక్ రీజియన్) సమావేశం జరగనున్న ప్రాంతాల్లో అధికారులతో మాట్లాడారు. ఏర్పాట్లు ఎక్కడివరకు వచ్చాయో అడిగి తెలుసుకున్నారు. సమయం తక్కువ ఉన్నందున అధికారులు, నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. అనంతరం హిల్ నెంబర్3 వద్దకు నేరుగా ముఖ్యమంత్రి చేరుకోకున్న క్రమంలో అక్కడ హెలిప్యాడ్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎపిఐఐసి అధికారులు, కాగ్నిజెంట్ ప్రతినిధులు, స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

జెన్ జెడ్ థీమ్ పోస్టాఫీస్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విద్యార్థులు, పరిశోధకులు క్యాంపస్ అధికారులకు ఆధునిక తపాలా సేవలను మరింత చేరువ చేయడానికి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అత్యాధునిక జెన్ -జెడ్ థీమ్ పోస్టాఫీస్‌ను మంగళవారం ఎయు విసి ప్రొఫెసర్ జిపి.రాజశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో తొలి జెన్-జెడ్ పోస్టాఫీస్ ఎయులో ఏర్పాటు చేయడం గర్వంగా, ఆనందంగా ఉందని పేర్కొన్నారు. థీసిస్, ప్రాజెక్టులు సిద్ధం చేసే విద్యార్థులకు కెరీర్ అభివృద్ధి కోసం ఆలోచనలను పంచుకునే వారికి ఇది ఎంతో మేలు చేస్తుందని తెలిపారు. విశాఖపట్నం ప్రాంతపు తపాలా పోస్ట్‌మాస్టర్ జనరల్ వి.ఎస్.జయశంకర్ మాట్లాడుతూ, భారత తపాలా వ్యవస్థ ఆవిష్కరణ, అందుబాటును పెంపొందించేందుకు కట్టుబడి ఉందని, విద్యార్థులందరూ ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని కోరారు.

విజయవంతంగా కేన్సర్ స్క్రీనింగ్ క్యాంప్

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : ఈస్ట్ కోస్ట్ రైల్వే మహిళా సంక్షేమ సంఘం-వాల్తేరు డివిజన్ ఆధ్వర్యాన మంగళవారం డివిజనల్ రైల్వే హాస్పిటల్ ప్రాంగణంలో కేన్సర్ స్క్రీనింగ్ క్యాంప్‌ను విజయవంతంగా నిర్వహించారు. మెడికవర్ కేన్సర్ ఇన్స్టిట్యూట్ వైద్య నిపుణుల సాంకేతిక సహకారంతో ఈ కేన్సర్ స్క్రీనింగ్, హెల్త్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్ ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా డివిజనల్ రైల్వే మేనేజర్ లలిత్ బోహ్రా హాజరై మాట్లాడుతూ, మహిళల ఆరోగ్యంపై దృష్టి సారించే ఇలాంటి కార్యక్రమాలు ఉద్యోగుల కుటుంబాలకు మరింత ప్రోత్సాహం అందిస్తాయని పేర్కొన్నారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షులు జ్యోత్స్నా బోహ్రా మెడికవర్ హాస్పిటల్స్ ఆంధ్రప్రదేశ్ రీజినల్ డైరెక్టర్ నిమ్మగడ్డ పద్మజ గెస్ట్ ఆఫ్ హానర్‌గా పాల్గొన్నారు. చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ డి.శరత్‌బాబు మాట్లాడుతూ 'బ్రెస్ట్, సర్వైకల్ కేన్సర్‌లను ప్రారంభ దశలోనే గుర్తించడంలో స్క్రీనింగ్ పరీక్షలు చాలా కీలకమని తెలిపారు. రక్తపోటు, ఈసీజీ, ఎముక సాంద్రత, పాప్‌స్మియర్, రక్త పరీక్షలు, ఉచిత స్పెషలిస్టు కన్సల్టేషన్లు అందించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన అడవిదున్న

ప్రజాశక్తి - కొయ్యూరు: కొయ్యూరు మండలం బూదరాళ్ళ పంచాయతీ కునుకూరు పాఠశాల ఉపాధ్యాయుడు విధులు నిర్వహించి తిరిగి వస్తుండగా చింతవాని పాలెం కొయ్యూరు మధ్యలో ఆయన ద్విచక్రవాహనాన్ని అడవి దున్న అకస్మాత్తుగా వచ్చి ఢీ కొట్టింది. ఆయన తలపై స్వల్ప గాయ మైంది. దీంతో ఆయన ఊపిరి పీల్చుకున్నారు.

వేడి గంజి పడి బాలునికి గాయాలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: స్థానిక అంబేద్కర్ నగర్‌కు చెందిన అడ్డాల సాత్విక్ (9) ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తూ వేడి గంజి మీద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి.సోమవారం సాత్విక్ కుటుంబసభ్యులు వంట చేస్తున్న సమయంలో వేడి గంజి గోడ మీద పెట్టారు. ప్రమాదవశాత్తూ సాత్విక్‌పై పడడంతో వీపుపై బొబ్బలు వచ్చి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అందించారు.

విద్యార్థులకు దుస్తులు అందించిన ప్రశాంతి

45 మంది విద్యార్థులకు దుస్తులు వితరణ

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ దొరగొంది ప్రాథమిక పాఠశాలలో 45 మంది విద్యార్థులకు అనకాపల్లి జిల్లా ఎలమంచిలి మండలానికి చెందిన ప్రశాంతి రెడీమేడ్ యజమాని దుస్తులు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా షాప్ యజమాని ప్రశాంతి మాట్లాడుతూ ఒక్కొక్క విద్యార్థికి రెండు జతలు చొప్పున 90 జతల దుస్తులు అందజేశామన్నారు. బీద విద్యార్థులకు ఏదో ఒక సహాయం చేయాలని ధృక్పథంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఉపాధ్యాయుడు పవన్ మాట్లాడుతూ గతంలో పరమసింగవరం ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించడానికి వచ్చినప్పుడు పేద విద్యార్థుల పరిస్థితిని గమనించి రెడీమేడ్ షాప్ యజమానికి తెలియజేయడంతో ఆయన దుస్తులు వితరణంగా అందించారని తెలిపారు. ప్రశాంతిని అభినందించారు.

నేచురల్స్ ఐస్‌క్రీమ్ అవుట్‌లెట్ ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దేశవ్యాప్తంగా ఎంతో ప్రసిద్ధి చెందిన 'నేచురల్స్ ఐస్‌క్రీమ్' విశాఖపట్నంలో తన మొదటి అవుట్‌లెట్‌ను మంగళవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా నేచురల్స్ ఐస్‌క్రీమ్ డైరెక్టర్ సిద్ధాంత్ కామత్ మాట్లాడుతూ, దశాబ్దాలుగా నేచురల్స్ తన ఫ్రూట్ ఐస్‌క్రీములతో ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. పండ్లు, పాలు, పంచదారతో తయారయ్యే ఈ ఐస్‌క్రీముల్లో సీతాఫల్, టెండర్ కొబ్బరి, చీకూ, క్లాసిక్ మలై వంటి రుచులు అవుట్‌లెట్‌ను సందర్శించిన వారి మదిని దోచాయన్నారు.

14న నేవీ మారథాన్

ఏర్పాట్లుకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశాలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : నేవీ డే వేడుకల్లో భాగంగా ఈస్టర్న్ నేవల్ కమాండ్ ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీన 10వ ఎడిషన్ వైజాగ్ నేవీ మారథాన్‌ను నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. కలెక్టరేట్ మీటింగు హాలులో కో-ఆర్డినేషన్ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ మారథాన్‌లో 17 దేశాల నుంచి 17,500 ఔత్సాహికులు భాగస్వామ్యం కానున్నారని, ఈ మేరకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. వెయ్యి మంది సిబ్బంది, 2000 మంది వాలంటీర్లు సేవల్లో నిమగ్నమవుతారని చెప్పారు. 42 కిలోమీటర్లు, 21 కిలోమీటర్లు,10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్లు విభాగాల్లో పోటీలు జరగనున్నాయని పేర్కొన్నారు. మారథాన్ ఆర్‌కె.బీచ్ వద్ద ప్రారంభమవుతుందన్నారు. ఏర్పాట్ల విషయంలో జిల్లా అధికారులు, నేవీ అధికారులు సమన్వయంతో వ్యవహరించాలన్నారు.